భూ భక్ష ఎన్నాళ్లు?

- పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం
- పర్యావరణానికి ముప్పు తెస్తున్న వైనం
- ప్రశ్నార్థకంగా మానవాళి మనుగడ

కాకినాడ సిటీ: భూమి మానవుడితో పాటు సకల జీవరాశులకు జీవనాధారం. జీవ పరిణామ క్రమంలో మానవుడు విజ్ఞానవంతుడై శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి సాధించి ధరిత్రిని కాపాడాల్సింది స్వార్థ పోకడలకు పోయి తనతో పాటు జీవరాశికి చేటు చేస్తున్నాడు. తాను తయారు చేసిన ప్లాస్టిక్‌తో తానతో పాటు భూగోళానికి భూతంలా తయారు చేస్తున్నాడు. పెరిగిన ప్లాస్టిక్ వినియోగం, ఆడవుల నరికివేత, పరిశ్రమల కాలుష్యం పర్యావరణానికి ముప్పుగా పరిణమిస్తోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలోకి కలవకపోవడంతో భూ ఉపరితలం వేడెక్కిపోతోంది. ఏటా జూలై మూడో తేదీన అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవంగా పర్యావరణ ప్రేమికులు పాటిస్తున్నా, ధరిత్రిని పరిరక్షించే చర్యలు మాత్రం నామమాత్రంగానే ఉంటున్నాయి. ఇప్పటికే 40 మైక్రాన్‌ల లోపు ఉన్న ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని ప్రభుత్వాలు ఆదేశిస్తున్నా అమలు ఎక్కడా కనిపించడం లేదు. ప్లాస్టిక్ ప్రభావంతో సంభవించే పెనుమార్పులతో ఏడాదికి 3.5 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. 2030 నాటికి మరణాల సంఖ్య ఐదు లక్షలకు చేరవచ్చని అంచనా.

ప్లాస్టిక్‌తో నష్టాలు

ప్లాస్టిక్ వ్యర్థాలకు భూమిలో కలిసే స్వభావం ఉండదు. దాని వల్ల వర్షపు నీరు భూ పై పొరల్లోనే నిలిచిపోయి భూగర్భ జలాలు అడుగంటుతాయి. పైగా పై పొరలోనే ఉండిపోయే ఆ వ్యర్థాలు భూ ఉపరితల వాతావరణాన్ని వేడెక్కిస్తాయి. ఒకవేళ తగులబెట్టినా వాతావరణంలోకి రసాయనాలు చొచ్చుకుపోయి ఆక్సిజన్ శాతం తగ్గిస్తుంది. ప్లాస్టిక్ వ్యర్థాలను తగులబెట్టడం వల్ల వాతావరణం కలుషితమై ఎల్‌నినో పొరలపై ప్రభావం చూపుతుంది.

రీసైక్లింగ్ ఒక్కటే మార్గం

ప్లాస్టిక్‌ను, రీ సైక్లింగ్ చేసి వినియోగించడం ఒక్కటే మార్గం అని పర్యావరణ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను రీ సైక్లింగ్ చేసి మళ్లీ వినియోగంలోకి తీసుకువచ్చే యంత్రాంగం పని చేస్తుంది. కాని మనదేశంతో పాటు అనేక దేశాల్లో ఈ చర్యలు అరుదు.

అందరికీ అన్నీ తెలిసినా..

ప్రభుత్వాలు, అధికారులు చిత్తశుద్ధితో కృషి చేస్తే తప్ప ప్లాస్టిక్ నియంత్రణ సాధ్యమయ్యే పనికాదు. వినియోగం సంగతి అటుంచితే ప్లాస్టిక్ సంచుల ఉత్పత్తిపై గొడ్డలి వేటు వేస్తే తప్ప ఈ సమస్యకు పరిష్కారం దొరకదు. ఎవరు ఎక్కడ తయారు చేస్తున్నదీ అధికారులకు, పాలకులకూ తెలిసి కూడా ఎవరి స్వార్థ ప్రయోజనాలు వారివి, ఎవరి భయాలు వారివి. ఆ రెండు వీడితే తప్పితే ప్లాస్టిక్ కట్టడి సాధ్యం కాదు.

భూతాపాన్ని తగ్గించుకోవచ్చు

పర్యావరణానికి ముప్పు కలిగించే అంశాల్లో అతి ప్రధానమైనంది భూ వాతావరణం వేడెక్కడం. దీని వల్ల మంచు కొండలు కరిగి సముద్రాలు నీటి మట్టాలు పెరగడం, ప్రపంచ వ్యాప్తంగా తుపానులు ఎక్కువవడం, రుతుపవనాల మార్పు, అతివృష్టి, అనావృష్టి ఉత్పాతాలు సహజంగా పరిణమిస్తాయి. క్లోరోఫ్లోరో కార్బన్లను విడుదలకు అధిక కారణాలయ్యే రిఫ్రిజిరేటర్లు, ఏసీల వినియోగం తగ్గించాలి. దూరప్రయాణాలకు కార్లు, బైక్‌లకు బదులు రైళ్లు, బస్సులను ఉపయోగించాలి. ప్రత్యామ్నాయ ఇంధన వనరులు అభివృద్ధి చేయాలి. హానికరమైన రసాయన ఎరువులకు బదులు సేంద్రీయ ఎరువులు వాడాలి. సుస్థిర వ్యవసాయ పద్ధతులు అవలంబించాలి. జీవ వైవిధ్యాన్ని పరిరక్షించి, భూమికి, జీవరాశికి హాని కలిగించే ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లను వాడడం మానుకోవాలి. ప్రభుత్వపరంగా అవగాహన కార్యక్రమాలు కల్పిస్తూ, పాఠశాలలు, కళాశాలల స్థాయిలో విద్యార్థులకు వీటిపై పూర్తి అవగాహన కల్పించాలి.





విదేశాల్లో నిర్వహిస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ యూనిట్లు



క్లుప్తంగా

అందరికీ అందుబాటులో ఉంటా



సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న కాకినాడ డివిజన్ దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఫణీంద్రకుమార్

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): దేవదాయ శాఖ ఉద్యోగులకు, అర్చకులుకు, సిబ్బందికి అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఇన్‌చార్జి దేవదాయశాఖాధికారి తోట సుబ్రహ్మణ్యం అన్నారు. జిల్లా ఇన్‌చార్జి దేవదాయశాఖాధికారిగా పనిచేసిన పులి నారాయణమూర్తి పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో తోట సుబ్రహ్మణ్యం మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. బాధ్యతలు తీసుకున్న ఆయనను ఆ శాఖ డీసీ కార్యాలయ సూపరింటెండెంట్ కె.నాగేశ్వరరావు, కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్రకుమార్, పలు సత్రాలు, ఆలయాలకు చెందిన ఈవోలు సత్కరించారు.

అమ్మ పేరుతో మొక్క నాటాలి



తన తల్లి పేరుతో మొక్క నాటుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పైడా వెంకటనారాయణ

బోట్‌క్లబ్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు అమ్మ పేరు మీద ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పైడా వెంకటనారాయణ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక 6వ డివిజన్‌లో రేచర్లపేటలో మంగళవారం మొక్కలు నాటారు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి నుంచి ఆయన జయంతి జులై 6 వరకూ ఈ మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మొక్కకు చుట్టూ రక్షణగా ఫెన్సింగ్ వేసి కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. అనంతరం బీజేపీ నాయకులు తన తల్లి పేరుతో మొక్కలు నాటారు. బీజేపీ నాయకులు ఏడిద కృష్ణ, గాలి దేవర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



గురజనాపల్లిలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

కరప: వాతావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద, పొలాల్లో మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్, మీడియా కోఆర్డినేటర్ తుమ్మలపల్లి నారాయణరావు పేర్కొన్నారు. మండలం నడకుదురు, గురజనాపల్లి గ్రామాల్లో మంగళవారం బీజేపీ నాయకులు పుట్టా వీరప్రసాద్‌గాంధీ, కింతాడ శివ, రొంగలి సన్యాసిరావు తదితరులతో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు వాతావరణ పరిరక్షణకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కల్సి మొక్కలు నాటేందుకు కృషి చేస్తున్నామన్నారు.

కబడ్డీ జట్టుకు క్రీడా సామగ్రి పంపిణీ



క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేస్తున్న తలాటం హరీష్

కాకినాడ రూరల్: గుంటూరులో రీజనల్ స్పోర్ట్స్ మీట్‌కు వెళుతున్న కబడ్డీ జట్టు సభ్యులకు తలాటం హరీష్ క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. వలసపాకల గ్రామంలో కేంద్రీయ విద్యాలయలో సోమవారం ప్రిన్సిపల్ బొంతు శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ద్వారా చైర్మన్ హరీష్ క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ శేఖర్ మాట్లాడుతూ తమ విద్యార్థులకు హరీష్ క్రీడా సామగ్రి అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బాపిరాజు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

10న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 10న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పి.వెంకటనారాయణ మంగళవారం తెలిపారు. ఎంపీపీ కారే సుధ అధ్యక్షతన ఈ సమావేశం ఉదయం 10. 30 గంటలకు ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. దీనికి అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికతో హాజరు కావాలని అన్నారు.

బెట్టింగులతో భవిత బేజారు



సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు

కాకినాడ రూరల్: ఒకప్పుడు నగరాలకు పరిమితమైన బెట్టింగ్‌ల సంస్కృతి నేడు పల్లెలకు పాకిందని, బెట్టింగ్‌లతో యువతకు ప్రాణ సంకటంగా మారుతోందని, చాలా మంది అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారని న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ వద్ద బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ తొలుత సరదాగా బెట్టింగ్‌లు మొదలు పెట్టి కాస్త డబ్బులు రాగానే ఆశ పెరిగి ఉన్నదంతా ధారపోసి నష్టపోతున్నారన్నారు. కొందరు అప్పులు చేసి బెట్టింగ్‌లకు పాల్పడి ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారన్నారు. సులభంగా డబ్బు సంపాదించాలని బెట్టింగ్‌లు పాల్పడే యువత చదువుల్లో కూడా వెనకపడుతున్నారని, దీనిని అరికట్టేందుకు కఠినమైన చట్టాలను అమలులోకి తీసుకురావలన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, శ్రీనగేష్, తదితరులు పాల్గొన్నారు.

రహదారి అభివృద్ధి పనులు
వేగవంతం చేయండి

- కమిషనర్ వెంకటరావు
- డంప్‌యార్డు నుంచి రైల్వే గేట్ వరకూ క్షేత్ర స్థాయి సమస్యల పరిశీలన



డ్రైనేజీల్లో పూడిక తీతపై సూచనలిస్తున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు మంగళవారం డంపింగ్ యార్డ్‌ను సందర్శించారు. ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, ఇతర అధికారులు, సిబ్బందితో కలిసి ఆ ప్రాంతానికి వెళ్లిన కమిషనర్ అక్కడి సమస్యలపై అధికారులతో చర్చించారు. ప్రధానంగా డంపింగ్ యార్డ్ నుంచి రైల్వే గేట్ వరకు రహదారిని పునరుద్ధరించాలనే ప్రతిపాదనకు సంబంధించి పనుల ప్రగతిని పరిశీలించారు. రానున్న నాలుగైదు రోజుల్లో రహదారి అభివృద్ధి పనుల ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారుల ఆదేశించారు. కాగా డంపింగ్ యార్డ్ వద్ద హూపర్ టిప్పర్, ఇతర వాహనాలు లోపలకు వెళ్లేందుకు ఎదురవుతున్న ఇబ్బందులను కమిషనర్ పరిశీలించారు. బురదమయంగా ఉన్న ఆ ప్రాంతాన్ని పరిశుభ్రం చేసి వాహనాల రాకపోకలకు అనువుగా ఉండేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు. అలాగే ఘన, వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాన్ని సందర్శించారు. తడి పొడి చెత్తను వేరు చేసి ఎరువుగా తయారు చేసే ప్రక్రియను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. రాజా రామ్మోహన్ నగర్ ప్రాంతంలో జరుగుతున్న పూడికతీత పనులను కూడా కమిషనర్ పర్యవేక్షించారు. పనులు మరింత వేగవంతం చేసి వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమిషనర్ వెంట ఏఈ వై. నాగేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లాజర్, ఇతర అధికారులు సిబ్బంది ఉన్నారు.

అతిసారతో అప్రమత్తం

- ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించాలి
- ఆర్‌బీఎస్‌కే, ఎన్‌సీడీ అధికారి డాక్టర్ ప్రభాకర్



అతిసార నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తున్న ఆర్‌బీఎస్‌కే, ఎన్‌సీడీ అధికారి డాక్టర్ ప్రభాకర్

కరప: జిల్లాలో అక్కడక్కడ అతిసార కేసులు నమోదవుతున్న నేపథ్యంలో, దానిపై అప్రమత్తంగా ఉండాలని, పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు, తల్లిదండ్రులకు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించాలని ఆర్‌బీఎస్‌కే (రాష్ట్రీయ బాలల స్వస్తిక్ కార్యక్రమం), ఎన్‌సీడీ (నాన్ కమ్యూనిటబుల్ డిసీజెస్) ప్రత్యేకాధికారి డాక్టర్ ప్రభాకర్ సూచించారు. యాంటీ డయేరియా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన వేళంగి పీహెచ్‌సీ పరిధిలోని వేములవాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, అంగ్‌వాడీ కార్యకర్తలకు, చిన్నారుల తల్లిదండ్రులకు అతిసార, ఇతర వ్యాధుల గురించి, తీసుకోవాల్సిన చర్యలను వివరించి, అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరికీ ఓఆర్ఎస్, జింక్ ప్యాకెట్లను అందజేయాలన్నారు. వేళంగి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎంకే సౌజన్య మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో అతిసార నిరోధానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఎంఎల్‌హెచ్‌పీలతో తాగునీటిని పరీక్షిస్తున్నట్టు తెలిపారు. క్లోరినేషన్ చేయించిన మంచినీటినే సరఫరా అయ్యేలా చూస్తున్నామన్నారు. 20 లీటర్ల తాగునీటికి ఒక క్లోరిన్ టాబ్లెట్ కలిపేలా పంచాయతీలకు వివరిస్తున్నామన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బహిరంగ ప్రదేశాలలో మలమూత్ర విసర్జన చేయరాదని, ఆహారం తీసుకునేటప్పుడు, చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలన్నారు. ఈగలు, దోమలు రాకుండా చూసుకోవాలన్నారు. కాచి, చల్లార్చిన తాగునీటినే తాగాలన్నారు. నిల్వ ఉన్న ఆహార పదార్థాలను భుజించరాదని డాక్టర్ సౌజన్య సూచించారు. వేళంగి పీహెచ్‌సీ సిబ్బంది ఎంపీహెచ్‌ఈఓ కె.గోవిందరావు, ఎంపీహెచ్ఎస్ రమణారావు, ఎంఎస్‌హెచ్‌పీ కీర్తి, ఏఎన్ఎం లావణ్య, ఎంపీహెచ్ఏ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్‌కు సత్కారం



డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ అనురాధ దంపతులను సత్కరిస్తున్న ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవీ మాధవి

కాకినాడ క్రైం: గత నెల 30న పదవీ విరమణ చేసిన జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్, సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.వెంకటరెడ్డిని రంగరాయ వైద్య కళాశాల అధికార బృందం ఘనంగా సత్కరించింది. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవీ మాధవిలు వెంకటరెడ్డి, అనురాధ దంపతులను సత్కరించి వారు రోగులకు అందిస్తున్న సేవలను కొనియాడారు. సర్జరీ విభాగంలో ఎనలేని సేవలు అందించిన డాక్టర్ వెంకటరెడ్డి డిప్యూటీ సూపరింటెండెంట్ హోదాకు వన్నె తెచ్చారన్నారు. నేటి తరం విధి నిర్వహణలో ఆయన స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలన్నారు. యావత్ ఉద్యోగ జీవితాన్ని పూర్తి నిజాయితీతో నిర్వర్తించిన ఆయనపై ఏనాడూ ఎటువంటి ఆరోపణ లేకపోవడం సహోద్యోగులుగా తమకు గర్వకారణమని పలువురు వైద్యులు కొనియాడారు. ఆయన శేష జీవితం సుఖ సంతోషాలతో కొనసాగాలని డీఎంఈ డాక్టర్ నరసింహం, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ఆకాంక్షించారు. సర్జరీ విభాగంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీలు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు వంద శాతం ఉండాలి

ఎంఈఓ శివరామకృష్ణయ్య



మామిళ్లదొడ్డి పాఠశాలలో విద్యార్థుల పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: పాఠశాలల్లో విద్యార్థులు 100 శాతం హాజరయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలో మామిళ్లదొడ్డ ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. శానిటేషన్ సక్రమంగా లేక పోవడంపై ఆయన అసంతృప్త వ్యక్తం చేశారు. పాఠశాలలోని పరిసరాలు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ప్రతి విద్యార్థీ మధ్యాహ్న భోజనం తినేలా మెనో ప్రకారం రుచికరంగా తయారు చేయాలన్నారు. ఈ మేరకు ప్రతి రోజు భోజనాన్ని ఉపాధ్యాయులు రుచి చూడాలన్నారు. విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పాలన్నారు. చేతి రాత బాగుంటే ఉంటే భవిష్యత్‌లో మంచి పార్కులు సాధించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ మేరకు విద్యార్థులు నేర్చుకున్న అంశాలపై ప్రశ్నలు వేసి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. ఎన్‌రోల్మెంట్ డ్రైవ్‌లో భాగంగా బడి బయట పిల్లలు లేకుండా ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలకు హాజరు కాని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. ఈ విధంగా చేయడం వల్ల విద్యార్థు లలో భయం ఏర్పడుతుందన్నారు. విద్యార్థులకు ఆకర్షణీయమైన బోధన చేయడం ద్వారా ప్రతి రోజు పాఠశాలకు హాజరవుతారని వివరించారు.

జనసేన శ్రేణుల అత్యుత్సాహం

వైఎస్సార్ విగ్రహం కనిపించకుండా ఫ్లెక్సీ ఏర్పాటు

కొత్తపల్లి: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో జనసేన పార్టీ నాయకులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. మండలంలోని ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్‌లో ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఫ్లెక్సీలతో పూర్తిగా మూసివేశారు. ఫ్లెక్సీని విగ్రహానికి కట్టడంపై వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు మండల సమావేశం

సామర్లకోట: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని ఎంపీడీఓ ఎస్‌డీ శ్యామ్‌సుందర్ తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే చినరాజప్ప ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.

స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదాలు



ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో కొత్తపల్లి వాకతిప్ప యూనియన్ బ్యాంకు వద్ద రోడ్డు దాటుతున్న విద్యార్థులు

కొత్తపల్లి: ఉప్పాడ– పిఠాపురం రోడ్డుపై వాహనాల వేగాన్ని నిరోధించే విధంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో వాకతిప్పలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వేగంగా దూసుకు వెళుతున్న వాహనాల కారణంగా ప్రజలు, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాకతిప్ప ఎంపీపీ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు యూనియన్ బ్యాంకు వద్ద తరచూ రోడ్డు దాటి పాఠశాలకు వెళుతున్నారు. ఏ వైపు నుంచి ఏ వాహనం వచ్చి ఢీ కొడుతుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఇక్కడ అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. స్థానికంగా ఉన్న యూనియన్ బ్యాంకుకు వెళ్లే ఖాతాదారులు రోడ్డు దాటే సమయంలో భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలకు వెళ్లే రోడ్డు ప్రదేశంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు డైరీల పంపిణీ

పిఠాపురం: యూటీఎఫ్ గొల్లప్రోలు మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గొల్లప్రోలు నగర పంచాయతీ, మండలంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు డైరీలు, సీఎల్ పుస్తకాలు పంపిణీ చేసారు. వీటిని మండల విద్యాశాఖాధికారి బీవీ శివప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ ఎస్ఎస్ఎస్ ప్రకాష్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చేదులూరి సూరిబాబు ఆవిష్కరించారు. అనంతరం గొల్లప్రోలు నగర పంచాయతీ, మండలంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు డైరీలు, సీఎల్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎంవీ సత్యనారాయణ, డి వీరాస్వామి, ఈ గోవిందరాజులు, గణేష్ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి హామీ బేఖాతరు

- దిగి రాని రాక్ సిరామిక్స్ యాజమాన్యం
- కొనసాగుతున్న కార్మికుల ఆందోళన



రాక్ సిరామిక్స్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

సామర్లకోట: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి తమను విధులలోకి తీసుకొనే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని రాక్ సిరామిక్స్‌లో తొలగింపునకు గురైన కార్మికులకు న్యాయం చేయాలని కోరినా యాజమాన్యం స్పందించడం లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్ అన్నారు. స్థానిక ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్‌లో తొలగించిన కార్మికులు ఫ్యాక్టరీ వద్ద నిర్వహిస్తున్న ఆందోళనలు మంగళవారం నాటికి 19 రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ ఫ్యాక్టరీ నుంచి కార్మికులను ఎన్నికల కోడ్ విడుదల అయిన సమయంలో తొలగించి ఇప్పటికి 78 రోజులు అయిందన్నారు. గత 19 రోజులుగా గేటు వద్ద కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని తమ సమస్యలు పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు చంద్రశేఖర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మూర్తి, ప్రభుదాసు, సతీష్‌కుమార్, శివనారాయణ, మల్లికార్జునరావు, గంగాధర్, క్రాంతి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పాడ తీర ప్రాంతంలో పర్యటించిన ఆర్డీవోలు



ఉప్పాడ తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవోలు కిశోర్, సీతారామారావు

కొత్తపల్లి: ఉప్పాడ తీర ప్రాంతంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు కిశోర్, సీతారామారావు మంగళవారం పర్యటించారు. బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉప్పాడ తీర ప్రాంతంలో కోతకు గురవుతున్న మత్స్యకార గృహాలు, నిర్మాణంలో ఉన్న మేజర్ హార్బర్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మత్స్యకారుల సమస్యలు తెలుసుకోనున్నారు. ఈ పర్యటనకు భారీ సంఖ్యలో జనాభా తరలివచ్చే అవకాశమున్న నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దారు సుందర్‌రాజు, ఎంపీడీవో వెంకటనారాయణ పాల్గొన్నారు.

టీడీపీ నేత ఇంటికి వెళ్తేనే పింఛన్లు!

సామర్లకోట: సామాజిక పింఛన్ల పంపిణీ రెండో రోజు మంగళవారం మండల పరిధిలో జి.మేడపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకుని ఇంటి వద్ద పంపిణీ చేయడంపై పింఛను లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం నాయకుని ఇంటి వద్దకు వెళ్లని వారికి పింఛన్ల పంపిణీ చేయలేదని ఆ గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు మోరంపూడి శ్రీరంగనాయకులు, పుట్టా బుజ్జిబాబు ఆరోపించారు. గతంలో ఎన్నడూ ఇటువంటి సంస్కృతి లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాల నుంచి పింఛన్ల కోసం వచ్చిన వారిని తెలుగుదేశం నాయకుని ఇంటి వద్దకు రప్పించుకున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులు విచారణ చేసిన సామాజిక పింఛన్ల లబ్ధిదారులకు న్యాయం చేయాలని కొరుతున్నారు.

మహిళ కాలిపై కణితి తొలగింపు



కణితి తొలగిస్తున్న డాక్టర్ వినయ్

పిఠాపురం: పిఠాపురం ఆర్బన్ హెల్త్ సెంటర్‌లో అరుదైన ఆపరేషన్ చేసి ఒక మహిళ కాలిపై కణితిని విజయవంతంగా తొలగించారు. పిఠాపురానికి చెందిన ఎస్ పాప కొన్ని నెలలుగా కాలిపై కణితి ఏర్పడి తీవ్ర ఇబ్బంది పడుతోంది. ఆమె మంగళవారం పిఠాపురం మంగయ్యమ్మరావుపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యులు డాక్టర్ యాళ్ల వినయ్ వద్దకు వచ్చి తన బాధ చెప్పుకుంది. ఆమెను పరీక్షించిన ఆయన ఆపరేషన్ చేసి ఆమె కాలికి ఉన్న కణితిని తొలగించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నట్లు ఆయన తెలిపారు.